కథ

# అలౌకికం

తులసి బాలకృష్ణ
87901 15544



కుక్కిమంచం మీద పడివుండి, కృష్ణపక్షపు చంద్రుడిలా రోజురోజుకీ కృశించిపోతున్న అన్నపూర్ణ శరీరం వైపు.. సెగలు పొగలుగా సాగుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాస క్రియ తాలూకు ఉక్కిరిబిక్కిరిలోంచి బయటపడటానికి విఫల ప్రయత్నం చేస్తూ.. కన్నీటి పొరల చాటుగా చూస్తున్నాడు పతంజలి. ఒకనాడు అత్యంత ముగ్ధ మోహన కళాగుళిక లాంటి ఆ ముఖమేనా ఇది?!.. ఇలా.. వాడిపోయిన తామర పువ్వులా!

గుండెలు కక్కటిల్లి పోతున్నాయి.

'ఈ రాత్రి గడుస్తుందా?' లోలోనే చీకటి కమ్మిన కాళ రాత్రి లాంటి భయంతో గొణుక్కున్నాడు.

పొద్దున ప్రారంభమైన గాలివాన.. గుండెల మీద కాళ్లుపెట్టి కదలకుండా నిలబడ్డ మదించిన వృషభంలా.. పైలోకంలో ఉన్న వారంతా ఒక్కుమ్మడిగా రోదిస్తున్నట్లుగా.. రాత్రి పదయినా ఇంకా అలా కురుస్తూనే ఉంది. పైన రేకుల మీద కురుస్తున్న వాన తాలూకు నిరంతర ధ్వని మరణ మృదంగనాదాన్ని తలపిస్తూ గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది.

సాయంత్రం పోయిన కరెంటు ఇంకా రాలేదు. వెలిగించిన గుడ్డి లాంతరు దీపం మసకబారుతూ అప్పుడప్పుడూ రెపరెపలాడుతూ.. అన్నపూర్ణ ముఖం మీద చావు బతుకుల తెరలను కదుపుతున్నది.

లోనుంచి వరద పొంగులా తన్నుకొస్తున్న దుఃఖానికి పళ్లని బిగపట్టి ప్రయత్నపూర్వకంగా ఆనకట్ట వేసి ఆపుకొన్నాడు పతంజలి. ఆ చిన్నగదిలోనే బయట వానకు తడిసిపోకుండా లోపలికి తెచ్చిపెట్టుకుని గోడవారగా నిలబెట్టిన తన మరో ప్రాణం.. తన జీవనాధారం అయిన పాత సైకిల్ మీదికి పారింది అతని చూపు. ఆ సైకిలూ, అన్నపూర్ణా ఒక్కసారే పరిచయమయ్యారు తనకి. ఆనాటి నుంచీ తన జీవితంలో భాగమైపోయి.. ఈనాడూ ఒక్కలాగే జీర్ణావస్థకి చేరిపోయి..

చెమ్మ ఇంకి, ప్రపంచపటం లాంటి మరకలతో తడిబారిన గోడకి నీరసంగా చేరగిలబడి.. కిందికి జారి కూర్చుని కళ్లు మూసుకున్నాడు పతంజలి.

తమ పరిచయం.. సంవత్సరాల క్రితం నాటి మాట!

* * *

పురి తిప్పిన ఉక్కు తీగల్లాంటి నరాలు కాళ్లలోంచి బయటికి ఉబికివచ్చేంత ఉద్వేగంతో.. కొలిమి నుంచి వెలువడే వేడి సెగలను తలపించే ఉచ్ఛ్వాస నిశ్వాసలతో.. చెదరని లక్ష్యంతో.. 'సాధించి తీరాలంతే' అనే ఉక్కు సంకల్పంతో.. తొక్కుతున్నాడు సైకిల్ని పతంజలి. కిలోమీటర్లు.. కిలోమీటర్లు.. తరిగిపోతున్నాయి.. గమ్యం చేరువవుతూ ఉంది.. పోటీదారులు వెనకబడుతున్నారు. కొద్దిసేపటికే అందరూ వెనకబడి పోయారు కూడా.. తనే ముందున్నాడు.. ముప్పై కిలోమీటర్ల సైకిల్ రేస్‌లో.. కాళ్లని యంత్రవేగంతో ఆడిస్తూ ముందుకు దూసుకుపోయి..

''అండ్ ద విన్నర్ ఈజ్.. మిస్టర్ పతంజలి!''..

కర్ణపేయంగా అనౌన్స్‌మెంట్ వినిపిస్తూనే గుండెలు ఆనందంతో రివ్వుమన్నాయి. గమ్యాన్ని చేరుతూనే సైకిల్ని అలవోకగా పచ్చిక మీదికి జార విడిచి, కూలబడి, హెల్పర్స్ అందించిన మంచినీటి బాటిల్ అందుకుని, తల మీద, ముఖం మీద వంచుకుని, నాలుక తడుపుకొని, పొంగుతున్న ఆనందంతో, ఆయాసం తీరడానికి మోకాళ్ల మీద తల ఆన్చుకుని సేదదీరుతున్నాడు పతంజలి. చుట్టుముట్టిన అనేకమంది అభినందిస్తూ పొగుడుతున్నారు..

''కంగ్రాచ్యులేషన్స్ టు ద హీరో ఆఫ్ ద డే!''..

స్వరమా అది!?.. ఈమని శంకర శాస్త్రి వీణానాదం కాదూ!?

చటుక్కున తలెత్తాడు పతంజలి. కళ్లెదురుగా.. తెల్లని అరటి దూట చివర పొందిగ్గా ఓ కలువని తగిలించినట్లున్న హస్తం!.. తన వైపే సాగి ఉంది.. అందుకోమన్నట్లుగా.. అభినందనగా! ఒళ్లు తెలియని నివ్వెరపాటుతో ఆ హస్తంలో అప్రయత్నంగానే తన హస్తాన్ని ఉంచాడు పతంజలి.

''కంగ్రాట్స్ వన్స్ అగైన్. బైదిబై.. ఐ యాం అన్నపూర్ణ''.. ముర్మురు ధ్వనితో అల్లన మెల్లన సాగుతున్న కృష్ణవేణమ్మ అలల్లాంటి మృదుమధుర స్వరం.

యాంత్రికంగా పతంజలి తల ఇంకొంచెం పైకి లేచింది. ధవళ కాంతులీనుతున్న కళ్లకి రేగడి ఒడ్డులాంటి నల్లటి కాటుకతో.. పండిన బాదపు రంగు పల్చని పెదవుల మధ్య పాల నురగలాంటి తెల్లని నవ్వుతో.. దిగివచ్చిన పున్నమి చందమామలా..

అవాక్కయి పోయి అలాగే చూస్తున్నాడు పతంజలి.

''నేను కూడా ఈ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కి సంబంధించిన కాంపిటీషన్స్‌లో పార్టిసిపెంట్‌నే! డ్యాన్స్ విభాగంలో. రియల్లీ ఐయాం థ్రిల్డ్ ఆఫ్టర్ సీయింగ్ యువర్ పెర్ఫార్మెన్స్!''.

సంభ్రమాశ్చర్యాలతో పతంజలికి నోరు పెగిలితే కదా.. ఏవేవో అలౌకిక అనుభూతులు. ఆమెతో గత జన్మలోనే ఏదో బంధమున్నంత వింత భ్రాంతి.

అది మొదలుగా.. ఆ పరిచయం వివిధ సందర్భాలలో కలయికగానూ.. అనేక రీతుల్లో ఆకర్షణతో నిండిన అభిమానంగానూ.. ఆపైన ప్రేమగానూ మారి.. చివరికి ప్రణయం దాకా దారితీసింది. ఆర్థిక స్థితుల స్థాయీ భేదం కారణంగా వారి పెళ్లికి సుతరామూ ఒప్పుకోమన్నారు అన్నపూర్ణ తాలూకు పెద్దలు. తెగించి, ఇంటిలోంచి బయటికి వచ్చేసి, పతంజలి చెయ్యందుకుంది అన్నపూర్ణ.

''నీ సంపన్న కుటుంబపు సుఖాలనన్నీ వదులుకుని, నాతోపాటే సామాన్య జీవితాన్ని గడపడానికి వచ్చేసిన నిన్ను పువ్వులలో పెట్టి చూసుకుంటూ, సుఖపెట్టాల్సిన నైతిక బాధ్యత నామీదుంది. నీచేత ఉద్యోగమే కాదు.. ఏ పనీ చెయ్యనియ్యను నేను'' అని కచ్చితంగా చెప్పేసిన పతంజలి.. స్పోర్ట్స్ కోటాలో బ్యాంక్ ఉద్యోగం సంపాదించుకున్నాడు.

చుట్టుపక్కల పిల్లలకి ఉచితంగా డ్యాన్స్ క్లాసులు తీసుకుంటూ, ఆనందంగా కాలక్షేపం చేస్తూ, భర్త సహకారంతో తరుచు బీదాబిక్కీకి అన్నదానం చేస్తూ.. సార్థక నామధేయురాలు అనిపించుకుంటున్నది అన్నపూర్ణ.

జీవితాలతో ఆడుకోవడం ఈ సృష్టికో వింత సరదా.

తృప్తిమయ జీవితాన్ని కొనసాగిస్తున్న వాళ్ల జీవితంలో పెద్ద కుదుపు..

పెళ్లయి మూడు సంవత్సరాలైనా కాకుండానే అన్నపూర్ణ పక్షవాతానికి గురయ్యింది. ఇప్పుడామె కదలలేదు. కాలు, చేయి కదిపి నృత్యం చెయ్యలేదు. కుమిలిపోయాడు పతంజలి. ఉద్యోగ సమయంలో తప్ప మిగిలిన కాలమంతా ఆమె చెంతనే ఉండి కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. మరో ఏడేళ్లు గడిచాయి. పతంజలి మీద మళ్లీ ఏ దేముడో కన్నెర్రజేశాడు. బ్యాంకులో తను చేయని నేరానికి బాధ్యుడిగా, అన్యాయంగా ఉద్యోగాన్నే పోగొట్టుకున్నాడు.

ఇటువంటి పరిస్థితులలో పిల్లలు లేకపోవడం ఓ వరమే అనిపించింది. అయినా, ఇల్లు గడవాలంటేనా.. అన్నపూర్ణకి మందులు కొనాలంటేనా తనకి పని కావాలి!